క్లుప్తంగా

'మనూ'లో వర్క్‌షాప్



మాట్లాడుతున్న వీసీ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మనూలో టెస్టింగ్, మూల్యాంకనం పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. 'మనూ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎస్‌ఈఅండ్‌టి), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ఇండియా(ఎన్‌టీఎస్–1) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్) సహకారంతో ఈ సదస్సును ప్రారంభించారు. అయిదు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వీసీ ప్రొ.ఐనుల్ హసన్ మాట్లాడారు. వివిధ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

రేపు జాతీయస్థాయి సెమినార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీలలో జాతీయస్థాయి సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకు హెచ్‌సీయూలోని జాకీర్ హుస్సేన్ లెక్చర్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ సెమినార్‌కు వీసీ ప్రొఫెసర్ బీజేరావు అధ్యక్షత వహిస్తారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ ప్రొఫెసర్ ఆర్‌వి రమణ మూర్తి, హెచ్‌సీయూ ప్రొఫెసర్లు కె లక్ష్మినారాయణ, డాక్టర్ తగాడే, మాజీ డీన్ ప్రొ.నర్సింహారెడ్డి పాల్గొంటారు.

'ఎస్కీ'లో నేడు రౌండ్ టేబుల్ సమావేశం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ డివిజన్ ఆధ్వర్యంలో ఒకరోజు రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్కీ ప్రాంగణంలోని చాణక్య సెమినార్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.'ఫ్లడ్ రిస్క్ మిటిగేషన్ అండ్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై జరుగుతుందన్నారు.

కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డా.రాజు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.రాజును నియమించారు. వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ రాజు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (ఈఎస్‌టీ)గా పని చేస్తున్నారు. డా.వరదాచారి స్థానంలో మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూత అందించడమే కొమిరిశెట్టి ఫౌండేషన్ లక్ష్యమని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖాజాగూడలోని జిల్లా పరిషత్ పాఠశాల, నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక నాయకుడు నరేష్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బస్‌పాస్‌లను అందించారు. పాఠశాల హెచ్‌ఎంలు తాజ్‌బాబు, వెంకట్‌రాంరెడ్డి, హెడ్ మాస్టర్ శ్యామల, పీఆర్‌టీయూ నాయకులు గాలి నరహరి, ఉపాధ్యాయులు పావని, నాయకులు భాస్కర్, నరేష్‌సింగ్, నరేష్, రమేష్‌గౌడ్, ఆర్టీసీ ఉద్యోగులు యుగంధర్, కే బాబురావు పాల్గొన్నారు.

నేడు రూ.1.10 కోట్ల పనులకు శంకుస్థాపనలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో బుధవారం రూ.1.10 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు గోపిదొడ్డిలో రూ.23 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు, రూ.87.50 లక్షలతో టెలికామ్‌నగర్, ప్రశాంతిహిల్స్‌కాలనీ, నానక్‌రాంగూడలో చేపట్టే భూగర్భడ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

ఎమ్మెల్యేకు వినతి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండకు చెందిన ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి కాలనీలో సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి షౌకత్ ఆలీ మున్నా, సభ్యులు ఖాజా, ఎంఏ సమద్, ఫిరోజ్, బడే ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్ తవ్వకం.. వారికి శాపం

- రెండు అపార్ట్‌మెంట్ల ప్రహరీలకు ప్రమాదం
- రాత్రికి రాత్రే ఖాళీ చేయించిన అధికారులు
- ప్రత్యామ్నాయ ప్రాంతాలకు 35 కుటుంబాలు
- నల్లగండ్లలో దయనీయ పరిస్థితి



కూలిపోయిన అపార్టుమెంట్ ప్రహరీ

శేరిలింగంపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో సెల్లార్ కోసం తవ్విన గుంత పక్కనే ఉన్న ప్రహరీ కూలిపోవడంతో ఆ అపార్ట్‌మెంట్ వాసుల పరిస్థితి దయనీయంగా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. రెండు అపార్ట్‌మెంట్లలోని వారిని సోమవారం రాత్రికి రాత్రే ఖాళీ చేయించారు. కట్టుబట్టలు, ఇతర విలువైన సామాన్లతో బయటికి వెళ్లిపోయిన ఘటన గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు..

సెల్లార్ తవ్వకాల్లో వర్టెక్స్ నిర్మాణ సంస్థ

ఏడాదిన్నర క్రితం నుంచి బహుళ అంతస్తుల భవన నిర్మాణం కోసం వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్ తవ్వకాలు జరుపుతోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ సెల్లార్ తవ్వకానికి ఆనుకొని ఉండే శ్రావ్య అపార్ట్‌మెంట్, ఆపిల్ అపార్ట్‌మెంట్ల ప్రహరీలు కూలిపోయాయి. ఒక దానికి బీటలు రాగా, మరొకటి సగానికిపైగా కూలిపోయింది. ఘటనా స్థలానికి జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు వచ్చారు. అపార్టుమెంట్‌వాసులతో మాట్లాడారు. సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రెండు అపార్ట్‌మెంట్లలో 35 కుటుంబాలను ఖాళీ చేయించారు. వర్టెక్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో అధికారులు మాట్లాడి వారికి రాత్రి వేళ ఉండేందుకు వసతి ఏర్పాటు చేశారు. ఎవరో చేసిన తప్పిదానికి తాము ఫలితం అనుభవించాల్సి రావడం అన్యాయమని అపార్టుమెంట్ వాసులు ఆవేదన వ్యక్తంచేశారు. వర్టెక్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు శ్రావ్యాస్ అపార్టుమెంట్ కింది భాగంలో సపోర్ట్ కోసం రాడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆయా అపార్టుమెంట్‌ల నుంచి వచ్చే డ్రైనేజీ మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. సెల్లార్ గోడ కూలకుండ ప్లాస్టిక్ షీట్లతో కప్పారు.



సెల్లార్ తవ్వకాలు

నోటీసులు ఇచ్చాం..

సెల్లార్ తవ్వకంతో అపార్టుమెంట్ల ప్రహరీలు దెబ్బతినడంతో నిర్మాణ సంస్థ వర్టెక్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం పరిశీలించనుందని ఆయన చెప్పారు. బృందం ఇచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

భయాందోళనకు గురయ్యాం...



సెల్లార్ పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో భయాందోళనకు గురయ్యాం. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. రాత్రికి రాత్రే వెళ్లాలంటే ఎంతో అసౌకర్యానికి గురయ్యాం. వర్టెక్స్ నిర్మాణ సంస్థపై పోలీసులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– భార్గవి, యాపిల్ అపార్టుమెంట్

నిర్లక్ష్యంతోనే సమస్య...



నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతోనే ఈ సమస్య వచ్చింది. ఎప్పటి నుంచే నిర్మాణ సంస్థకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేశామని చెబుతున్నారు. సదరు నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

– జానకీ శ్రీధర్‌రెడ్డి, యాపిల్ అపార్టుమెంట్

ప్రజల ప్రాణాలతో చెలగాటం

జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్



అపార్టుమెంట్ ప్రహరీ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్ తెలిపారు. నల్లగండ్లలో చేపట్టిన సెల్లార్‌తో అపార్టుమెంట్‌ల ప్రహరీలు దెబ్బతిన్న ప్రాంతాన్ని స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ సెట్‌బ్యాక్‌లు వదలకుండా సెల్లార్‌లు తవ్వుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. వర్టెక్స్ సంస్థ ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేస్తుందని విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అక్రమ కట్టడాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెల్లార్ పూడ్చివేతకు ఆదేశాలు



ఏసీపీ మెహ్రాతో మాట్లాడుతున్న కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు, లావెన్ హోమ్స్ వాసులు



నల్లగండ్లలో సెల్లార్ పూడ్చివేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో అపార్టుమెంట్ సెల్లార్‌తో తమ అపార్టుమెంట్‌కు ప్రమాదం ఉందని లావెన్ హోమ్స్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం నల్లగండ్లలోని గౌతమి మోడల్ స్కూల్ సమీపంలో ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ సెల్లార్ తవ్వకం ఏప్రిల్ నుంచి కొనసాగుతుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి లావెన్ హోమ్స్ అపార్టుమెంట్ ప్రహరీ కింది భాగంలో మట్టి కూలిపోవడంతో అపార్టుమెంట్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రభుత్వ విప్ గాంధీకి సమస్యను వివరించారు. వెంటనే టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెహ్రా సెల్లార్‌ను పూడ్చాలని ఆదేశించారు. లావెన్ హోమ్స్ ప్రతినిధులు రెసిడెన్షియల్ ప్రాంతంలో హాస్పిటల్ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని నిలదీశారు. కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా సెల్లార్ తవ్వారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులు, కుంటల పరిశీలన



అంబీర్ చెరువును పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జానకి రామరాజు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ బీజేపీ నాయకులు మంగళవారం చెరువులు, కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జానకి రామరాజు మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా హైదర్‌నగర్‌లోని అంబీర్‌చెరువు నిండుకుండను తలపిస్తుందన్నారు. ఇరిగేషన్ అధికారులు అంబీర్ చెరువులో మురుగు ప్రవహించకుండా అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు వెలగ శ్రీనివాస్, వేణుగోపాల్ యాదవ్, కృష్ణంరాజు, శేషయ్య, నాగిరెడ్డి, బాలాజీ, కృష్ణ, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'టీహబ్'లో ఎంఓయూ



సెనెకాగ్లోబల్, ఎక్విప్ సంస్థల ఒప్పందం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఈఎస్‌జీ టెక్నాలజీ సొల్యూషన్స్‌ను అందించడానికి రెండు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ సమక్షంలో ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్, సెనెకా గ్లోబల్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జయేష్‌రంజన్ మాట్లాడుతూ జాయింట్ వెంచర్ పట్ల ఆశాభావంను వ్యక్తం చేశారు. సామాజిక శ్రేయస్సు కోసం సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెనెకాగ్లోబల్, ఎక్విప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి, ఫిర్యాదుల్లో భాగంగా ఈనెల 27న నిధి ఆప్‌కే నిఖత్‌ను నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగ్రవాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 గంటల నుంచి 5.45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి అశోక్‌నగర్ హోండా షోరూమ్, సంగారెడ్డి జిల్లాకు సంబంధించి జహీరాబాద్ అల్లిపూర్ మెథోడిస్ట్ రూరల్ హై స్కూల్, మెదక్ జిల్లాలో నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 14 మందికి కరోనా టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

శిథిల ఇళ్లలో ఉండొద్దు

- మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పాడుబడ్డ ఇళ్లలో ఉండొద్దని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఉన్న పాత ఇళ్లను కూల్చివేయించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న 40 ఇళ్లను గుర్తించామని, వాటిని కూల్చివేయిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

'మనూ'లో సీయూఈటీ ద్వారానే యూజీ ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023–24 అకడమిక్‌కు కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ)–2023 ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు అందిస్తుందని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వనజ తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి ఇటీవల ఫలితాలను ప్రకటించింది.నాలుగేళ్లయూజీ కోర్సులలో ప్రవేశానికి ఎంపికగా 'మనూ' ఎంచుకున్న అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. అడ్మిషన్ కోసం ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ఆగస్టు 9, 10వ తేదీలలో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ



నల్లగండ్లలో ప్రహరీలు కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: సేఫ్టీ నిబంధనలు పాటించకుండా సెల్లార్ తవ్వకం చేపట్టడం తప్పని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ అన్నారు. నల్లగండ్లలోని సెల్లార్ వల్ల అపార్టుమెంట్ ప్రహరీలు కూలడంతో సోమవారం రాత్రి ఆయన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం వారు నిర్లక్ష్యం చేస్తే వారిపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి



కూలిన అపార్టుమెంట్ గోడను పరిశీలించిన కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆలీతలాబ్ చెరువు సమీపంలో జానకిరామ టవర్స్ ప్రహరీ గోడ వరద ధాటికి కూలిపోవటంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలీ తలాబ్ చెరువు నుంచి వెళ్లే నీరు తూము కాలువ పైపులైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి జానకిరామ అపార్టుమెంట్ ప్రహరీ గోడను నిర్మించాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో ఎటువంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ నాయకులు పోతుల రాజేందర్, అపార్టుమెంట్ వాసులు హరి సురేష్‌బాబు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటకృష్ణ ,శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

డిప్యూటీ తహశీల్దార్ రాములు సూచన



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రాములు

పటాన్‌చెరు టౌన్: అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు డిప్యూటీ తహశీల్దార్ బొమ్మ రాములు పిలుపునిచ్చారు. నూతన ఓటర్ల నమోదుపై గీతం విశ్వవిద్యాలయంలో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రాములు మాట్లాడుతూ... జిల్లాలో నూతన ఓటరు నమోదు శాతం ఆశించిన దానికంటే తక్కువగా ఉందన్నారు. దానిపై అవగాహన కల్పించేందుకు గాను 18 ఏళ్లు నిండిన వారితో ముఖాముఖి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఇప్పటికే ఓటరుగా నమోదు చేసుకున్నవారు ఏవైనా మార్పు చేర్పులు చేసుకునే వెసులుబాటును కూడా కల్పిస్తున్నామన్నారు.జనవరి 1, 2023కు 18 సంవత్సరాలు నిండిన వారంతా ఫారం–6ను నింపి నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని, మార్పులు లేదా సవరణ (చిరునామా మార్పు) కోసం ఫారం–8 నింపాలని, ఇతర వివరాల కోసం 1950 టోల్ నంబర్ కు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు సంప్రదించవచ్చన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి



జాతీయ రహదారిపై సీఐటీయూ ర్యాలీ

పటాన్‌చెరు: మణిపూర్ సీఎం తక్షణమే రాజీనామా చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలో సమాజం తలదించుకోవలసి వస్తుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించే విషయంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. తెగల మధ్యన చిచ్చుపెట్టి కేంద్రం రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు సుధాకర్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్ ,కిరణ్, రాంచందర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి



రాయదుర్గం: శేరిలింగంపల్లి ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పర్యటించారు. గచ్చిబౌలిలోని బయోడైవర్శిటీ పార్కు కూడలి, ఎన్నికల కమిషన్ కార్యాలయ భవన నిర్మాణ ప్రాంతంలో వరద పరిస్థితి, రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపైకి నీరు రాకుండా, నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా లింగంపల్లిలోని అండర్‌బ్రిడ్జి ప్రాంతాన్ని కూడా పరిశీలించారు.

కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్– 2లో నాలా పక్క వీధిలో రోడ్డు వేయాలని స్థానికులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డును త్వరలో మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చూస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, భాస్కర్, సైమాన్‌రెడ్డి, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు



కార్యక్రమాన్ని ప్రారంభించిన టీసీఈఐ ప్రెసిడెంట్ బలరామ్, జనరల్ సెక్రటరీ రవి తదితరులు

మాదాపూర్: దేశం నలుమూలల నుంచి వచ్చిన అత్యుత్తమ ఈవెంట్ ప్రొఫెషనల్స్‌కి టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డులను అందజేశారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహిస్తున్న టీసీఈఐ ఎస్‌డబ్ల్యూపీసీ గ్లోబల్ 2023 కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవార్డులను అందజేశారు. టీసీఈఐ ప్రెసిడెంట్ బలరామ్, జనరల్ సెక్రటరీ రవిబూరలు అవార్డులను అందజేశారు. టీసీఈఐ మాజీ ప్రధాన కార్యదర్శి దివంగత డాక్టర్ సీరజ్ కేఎస్ ఠాకూర్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం, ప్రతిష్టాత్మక కోహినూర్ అవార్డును గ్రీన్‌కో గ్రూప్, ఫార్ములా ఇ వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ , హైదరాబాద్ ప్రమోటర్లు ఈ అవార్డులను గెలుచుకున్నారు. జేడ్ఆఫ్ హైదరాబాద్ అవార్డును గ్లామరైజర్స్‌కు చెందిన అసిమ్‌వర్మకు అందజేశారు. పర్ల్ ఆఫ్ హైదరాబాద్ కేటగిరిలో 52 మందికి, జెమ్ ఆఫ్ అవార్డు కేటగిరిలో 43 మందికి అందజేశారు.

వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి



సైబర్‌టవర్స్ వద్ద ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న డీసీపీ హర్షవర్ధన్ తదితరులు

మాదాపూర్: వర్షం కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్ తెలిపారు. మాదాపూర్‌లోని సైబర్‌టవర్స్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఐటీ ప్రాంతం కావడంతో విధుల నిమిత్తం కార్యాలయాలకు చేరుకునే క్రమంలో అందరూ ఒక్కసారిగా రావడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్‌ని పాటించాలని, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.